క్లుప్తంగా

బాల మహోత్సవంలో విద్యార్థుల ప్రతిభ



కర్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రీజియన్ పరిధిలో సికింద్రాబాద్‌లో జరిగిన బాల మహోత్సవంలో తమ పాఠశాల స్కౌట్ విద్యార్థులు పాల్గొని మెరుగైన ప్రతిభ కనబరిచినట్లు కర్లపాలెం హైవెండ్ హైస్కూల్ ఎండీ బీఎస్ మహేంద్రబాబు, డైరెక్టర్ పి.చాందినీ తెలిపారు. బాల మహోత్సవంలో పాల్గొన్న స్కౌట్ విద్యార్థులు పవన్‌కుమార్ రెడ్డి, హవీష్, షణ్ముఖరెడ్డి, మహేష్ సాయి, విజయ్, నిస్సీ, మహేంద్రరెడ్డి, ఉమా నాగ చైతన్య, గోపిరాజులకు బుధవారం పాఠశాలలో చైర్మన్ పి.ఉదయ్‌చంద్రరావు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు గడ్డిమందు పిచికారీ

చదలవాడ(వేమూరు): దోమల బెడద నిర్మూలన కోసం గడ్డి మందు పిచికారీ చేశామని గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ తెలిపారు. వేమూరు మండలంలోని చదలవాడ గ్రామంలోని రోడ్లు, కాలువలకు ఇరుపైపుల గడ్డి మందు పిచికారీ చేయడం జరిగిందన్నారు. దోమల బెడదతో సీజనల్ వ్యాధులతో పాటు అంటు వ్యాధులు వ్యాప్తి చెందడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నిర్మూలన కొరకు గడ్డి మందు, దోమల మందులు పిచికారీ చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు గ్రామంలో గడ్డి మందు పిచికారీ చేయడం జరిగిందన్నారు. ప్రతి నెల దోమల నిర్మూలన కొరకు దోమల మందు పిచికారీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ షాదిక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు పారుదల జరిగేలా చూడండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన కాల్వల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపం సమీపంలోని కాల్వల్లో బుధవారం జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. వర్షపు నీరు కూడా రోడ్లపై ఉండకుండా మురుగు కాల్వల ద్వారా బయటకు పోయే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం ఆరో వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, డీఈ సుబ్బారావు, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ బ్యాటరీల చోరీ

పట్నంబజారు: ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సంబంధించిన బ్యాటరీలను గుర్తుతెలియని దుండగులు అపహరించుకు పోయిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. కొత్తపేట పోలీసుల వివరాల మేరకు.. హిందూ కళాశాల కూడలిలోని మూడు ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సంబంధించి కొద్దిరోజుల క్రితం నూతన బ్యాటరీలను అమర్చారు. మూడు రోజుల వ్యవధిలోనే గుర్తుతెలియని దుండగులు సుమారు రూ. లక్ష విలువ చేసే ఆరు బ్యాటరీలను అపహరించుకుపోయారు. ఇదే ఘటన గత మూడు నెలల క్రితం చోటు చేసుకుంది. హిందూ కళాశాల కూడలిలో ఉన్న సీసీ కెమెరాలు సైతం పనిచేయకపోవడంతో ఎవరు అపహరించుకుపోయారనేది తెలియరాలేదు. గత మూడు నెలల క్రితం జరిగిన ఘటన తరువాత కూడా ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే మరోసారి బ్యాటరీల చోరీ జరిగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని ఏర్పాటు చేసిన చైతన్య మీడియా సూపర్‌వైజర్ కోలూరి సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

బాపట్లటౌన్: ప్రమాదవశాత్తు రైలునుంచి జారి పడిన యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన బాపట్ల రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న రైలులో నుంచి గుర్తు తెలియని యువకుడు బాపట్ల రైల్వేస్టేషన్‌లో జారిపడ్డారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక హక్కులు హరిస్తే పోరాటాలు తప్పవు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



రేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్న నాయకులు



చుండూరులో తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు



వేమూరులో తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా



భట్టిప్రోలులో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన



అమృతలూరులో తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



కొల్లూరులో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రేపల్లె రూరల్: కార్మికుల హక్కులు హరిస్తే పోరాటాలు తప్పవని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. కేంద్రం ప్రభుత్వం కార్మికులకు నష్టంచేసే లేబర్ కోడ్‌లు అమలు చేయటానికి ఉత్తర్వులను జారీ చెయ్యటానికి సిద్ధపడుతోంని, ఉత్తర్వులు అమలైతే కార్మిక చట్టాలు నిర్వీర్యమైపోతాయని అన్నారు. అంగన్‌వాడీ, ఆశా, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధిహామీ, మున్సిపాలిటీ, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. వీరికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించటంతో పాటు పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గెస్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, ముఠా భవన నిర్మాణ కార్మికుల భద్రతకు చట్టం చేయాలని చెప్పారు. డ్రైవర్లకు ఉరితాడు లాంటి శిక్షలు విధించే నూతన న్యాయ చట్టాల అమలు ఆపివేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయమైన కోర్కెల సాధనకై ఆందోళన కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత ఉధృతం చేయటం జరుగుతుందన్నారు. ధర్నాలో సీఐటీయూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కే.రూనీ, ఆశా వర్కర్స్ యూనియన్ రేపల్లె డివిజన్ అధ్యక్షురాలు సీహెచ్ వీరలక్ష్మి, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు, రైస్ మిల్లు ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాకా.సుబ్బారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జే.ధర్మరాజు, నాయకులు కే.ఆశీర్వాదం, వై. కిషోర్, కే.రమేష్, బి.అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

అమృతలూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

అమృతలూరు(భట్టిప్రోలు): దేశ వ్యాప్తంగా కార్మికుల కోర్కెల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం అమృతలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి పింఛన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ డి.కవితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాణి, బుల్లెమ్మాయి, తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో కార్మికుల ఆందోళన

భట్టిప్రోలు: కార్మికుల డిమాండ్స్ డే పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికుల హక్కులను హరించే లేబర్ యాక్ట్‌ను రద్దు చేయాలని భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఐ.మునిలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) మండల నాయకులు గృహలక్ష్మి, చెల్లమ్మ, వరలక్ష్మి, మమత, సూర్యలక్ష్మి, వాణి, రూపారాణి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు జయమ్మ, నరసింహులు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘం నాయకులు మురుగుడు సత్యన్నారాయణ, గోళ్ల నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్ కుమార్, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

కొల్లూరు : కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణం కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బుధవారం దేశవ్యాప్త కార్మికుల డిమాండ్స్ డే నిర్వహణలో భాగంగా అంగన్‌వాడీ, ఆశా, పారిశుద్ధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కొల్లూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయడంతో పాటు, సుప్రీంకోర్టు సూచించిన విధంగా రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు తక్షణం నూనెలు, సోప్‌లు, యూనిఫామ్ ఇవ్వాలని, ఆశా కార్యకర్తలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు, అన్ని రంగాలలో వారిని రాజకీయ తొలగింపులకు గురి కాకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బొనిగల సుబ్బారావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు నీరజ, కాశీ విశాలాక్షి, బాలా త్రిపురసుందరి, భాగ్యం, సౌభాగ్యం, పంచాయతీ వర్కర్‌లు ఆదిలక్ష్మి, సుజాత, సురేష్, ఆశా వర్కర్‌లు జ్యోతి, రంగమ్మ, ధనమణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

చుండూరు(వేమూరు): దేశవ్యాప్త కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న డిమాండ్ డేలో భాగంగా మండల కేంద్రంలో సీఐటీయూ అధ్వర్యంలో కార్మికులు ధర్నా చేసి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయుకులు టి కృష్ణ మోహన్ మాట్లాడుతూ కేంద్రం ఎన్నికలు అనంతరం కార్మికులకు నష్టం చేసే లెబర్ కోడ్‌ను అమలు చేయటానికి ఉత్తర్వులను జారీ చేయటానికి సిద్ధంగా ఉందన్నారు. లేబర్ కోడ్ అమలు చేస్తే నేడు ఉన్న చట్టాలు రద్దవుతాయన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ అమలును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ రద్దు చేయాలి, జాతీయ నగదు బదిలీ కరణ పథకం ఆపాలి, అంగన్‌వాడీ, ఆశా,మధ్యాహ్నం భోజనం పథకం, కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీమన్నారాయణ, వెంకట రెడ్డి, పద్మ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

వేమూరు: స్కీమ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు బొలిగల అగస్టీన్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధ వారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని, సుప్రీమ్ కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులు, చిరుద్యోగులను బలవంతంగా తొలగించడం మానుకోవాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, స్కీమ్ వర్కర్స్ అందరికీ పెన్షన్ లాంటి సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వి కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ యూనియన్ నాయకురాలు పి బసవమ్మ, అన్నపూర్ణ, శాంతకుమారి, వేమూరి మోజెస్, గాజుల మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణా తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ఎంసీఏ కార్యదర్శి శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: మహిళల అభ్యున్నతికి ఎంసీఏ ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటుందని ఎంసీఏ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఎంసీఏ) ఆధ్వర్యంలో ఎలిఫ్ సంస్థ వారిచే మహిళలకు నిర్వహిస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ 10వ బ్యాచ్ ఉచిత శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఎంసీఏ ఉచితంగా కుట్టు శిక్షణ, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే వందలాది మంది మహిళలు ఈ శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందటాన్ని ఎంసీఏ గర్వంగా భావిస్తుందన్నారు. భవిష్యత్‌లోనూ మహిళలకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎలిఫ్ సంస్థ కోఆర్డినేటర్ శోభ, ట్రైనర్ బాలాత్రిపుర సుందరి, ఎంసీఏ సభ్యులు బాపారావు, రమేష్, సత్యప్రసాద్, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ



ఐలవరంలో స్టూడెంట్ కిట్స్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేశారు. హైస్కూల్ హెచ్ఎం మాచర్ల మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కిట్స్‌ను గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి విద్యార్థులకు అందచేశారు. ఈ కిట్స్‌లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫామ్, బూట్లు, బెల్ట్, టై, సాక్స్ తదితర వస్తువులను ప్రభుత్వం విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలోని పలు హైస్కూళ్లకు చెందిన 50 మంది విద్యార్థులకు ఈ స్టూడెంట్స్ కిట్స్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజు, పెదపులివర్రు జెడ్పీ, భట్టిప్రోలు టీఎంరావు, సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె మహబూబ్ సుభాని, చందలూరి రామకోటేశ్వరరావు, శ్రీనివాస శర్మ, ఐలవరం గ్రామ కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్స్ షాపులో చోరీ

- రూ.ఎనిమిది లక్షలు అపహరణ
- పోలీసులు దర్యాప్తు



దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తెనాలిరూరల్: తెనాలి శివాజీచౌక్‌లోని ఓ కూల్‌డ్రింక్స్ షాపులో చోరీ జరిగింది. దుకాణ తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లిన దుండగులు అక్కడి బీరువాలో ఉంచిన రూ.ఎనిమిది లక్షలు అపహరించుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శివాజీ చౌక్‌లో శ్రీనివాసరావు కూల్‌డ్రింక్స్ షాపును నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి దుకాణాన్ని మూసివేసే సమయంలో తన వద్ద ఉన్న రూ. ఎనిమిది లక్షలను లోపలి బీరువాలో ఉంచి తాళాలు వేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా దుకాణానికి బయట వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి అందులో ఉంచిన నగదు అపహరణకు గురైందని తెలుసుకున్నాడు. వెంటనే సమాచారాన్ని వన్‌టౌన్ పోలీసులకు తెలుపగా ఎస్ఐ కరీముల్లా తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. బీరువాలో ఉంచిన కొద్ది మొత్తం నగదును అక్కడే వదిలి వెళ్లడం, కేవలం రూ.8 లక్షలు తీసుకెళ్లడంతో తెలిసిన వారి పనే అయి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యలపై లోకేష్‌కు వినతి

గుంటూరు మెడికల్: గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తెలుగునాడు కమ్యూనిటీ పారా మెడిక్స్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు మంత్రి నారా లోకేష్‌ను ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్ఎంపీలకు యువగళంలో ఇచ్చిన హామీని యూనియన్ నేతలు మంత్రి లోకేష్‌కు గుర్తు చేశారు. యువగళంలో మాట ఇచ్చిన ప్రకారం తక్షణమే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు గ్రామీణ వైద్యుల సమస్యలపై నివేదిక అందజేయాలని మంత్రి లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. లోకేష్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రవిచంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రసూల్, కోశాధికారి వెంకటరాజారావు తదితరులు ఉన్నారు.

దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం జయంతి

తెనాలి: దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం జయంతిని బుధవారం స్థానిక అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ దళిత ఉద్యమనేత ఏసురత్నం, దేశవిదేశాల్లో దళితవాణిని వినిపించి, అనేక ప్రతిఘటన పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాల కనుగుణంగా ప్రజలకు సేవచేయాలని కోరారు. ఏసురత్నం ఉద్యమస్ఫూర్తి, త్యాగనిరతి, పోరాట దీక్షలను దళిత నేతలు పిల్లి విద్యాసాగర్, వేము సమత, భీమిరెడ్డి శేషు, డాక్టర్ అబ్రహాం లింకన్, సేవా ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, దాస్, అందే శ్యామ్ వివరించారు. ఏసురత్నం మార్గంలో పయనించి దళిత విముక్తి మార్గంలో పనిచేయటమే కర్తవ్యమన్నారు. అంబేడ్కర్‌వాదం, మార్క్సిజం వాదం స్ఫూర్తితో సాంఘిక, ఆర్థిక విప్లవాల బాటలో నడవటమే ఆయన ఆశయాల్ని నెరవేర్చటమన్నారు. జల్లి గంటయ్య, ఎం.ప్రభాకరరావు, పినపాటి రవికుమార్ పాల్గొన్నారు. తొలుత ఏసురత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని మోటివేషనల్ ట్రైనర్ కె.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సంగడి గుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో బుధవారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు సత్యంలో జీవించకుండా స్వప్నంలో జీవిస్తున్నారని, అనుభవంతో పెద్దలు చెప్పే విషయాలు రాళ్ల దెబ్బల వలే ఉంటాయన్నారు. అవి జీవితానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. భారత్ వికాస్ పరిషత్ గుంటూరు అధ్యక్షుడు చలమయ్య మాట్లాడుతూ ఎన్నో విజయవంతమైన కార్యక్రమాలను నిర్వహించిన భారత్ వికాస్ పరిషత్ 63 సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రేరణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు, ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు, భారత్ వికాస్ పరిషత్ కార్యదర్శి రాజశేఖర్, ఆర్థిక కార్యదర్శి కాళంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా వీవీఐటీ జగన్నాథ రథయాత్ర



వీవీఐటీ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర

- పెద్ద ఎత్తున హాజరైన భక్తజనం
- రథయాత్రను విజయవంతంగా నిర్వహించిన వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌కు పురస్కారం



రథాన్ని బంగారు చీపురుతో శుభ్రపరిచి యాత్రను ప్రారంభిస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్ దంపతులు

పెదకాకాని : పూరీ జగన్నాథుని రథయాత్రను పురస్కరించుకొని విజ్ఞాన్, వీవీఐటీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వీవీఐటీ జగన్నాథ రథయాత్ర పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం నుంచి వీవీఐటీ కళాశాల వరకు డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలు, భక్త బృందాల కోలాటాల నడుమ బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ రథాన్ని విజ్ఞాన్, వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణ ప్రియ దంపతులు బంగారు చీపురుతో (చెరాపహరా)తో శుభ్రపరచి రథయాత్రను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు, ఇస్కాన్ సభ్యులు, విదేశీ భక్తుల సంకీర్తనల నడుమ 'జై జగన్నాథ' నినాదాలతో యాత్ర శోభాయమానంగా సాగింది. ఇస్కాన్ సభ్యులు వీవీఐటీ కళాశాల వద్ద దేవతా మూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, మహాహారతి ఇచ్చి విద్యార్థులకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా 6 కి.మీ. శ్రీ జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్న ఏకైక విద్యాసంస్థలుగా విజ్ఞాన్, వీవీఐటీలను గుర్తిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ వారు ఇండియన్ వరల్డ్ రికార్డు పురస్కారాన్ని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్, వీవీఐటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఇస్కాన్ మంగళగిరి ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో నెహ్రూనికేతన్‌కు రాష్ట్రస్థాయి ర్యాంకులు



మెడల్స్ సాధించిన విద్యార్థులతో ఎండీ మురళీకాంత్

తెనాలిఅర్బన్: ముంబయికి చెందిన ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ సంస్థ ఆధ్వర్యంలో గతేడాది జరిగిన జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్షల్లో తెనాలి బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు లభించాయని విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. గణిత ఒలంపియాడ్‌లో కె.తరణికి (4వ ర్యాంకు), చిత్రలేఖనంలో తారక్ రామ్ (4ర్యాంకు), కంప్యూటర్‌లో ఎం.శివవశిష్ఠ (7వ ర్యాంకు)తో పాటు మరో ఐదుగురికి మంచి ర్యాంకులు వచ్చినట్లు చెప్పారు. వీరికి బుధవారం పాఠశాల ఆవరణలో పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దాం



గుంటూరు రూరల్: డయేరియా నివారణకు సమష్టిగా కృషి చేసి ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దామని మండల అభివృద్ధి అధికారి ఆదినారాయణరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల్లో తిరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డయేరియా నివారణకు కృషి చేద్దామని నినాదాలు చేశారు. జల్ జీవన్ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్‌కుమార్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, డయేరియాపై అవగాహన కల్పించారు. గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. డయేరియా చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జల్ జీవన్ మిషన్ కో ఆర్డినేటర్లు సంగీత్, షఫీ, మండల కోఆర్డినేటర్ సురేష్, ఈఓ ఆంజనేయప్రసాద్, సర్పంచ్ లలిత కుమారి, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.